సాక్షి తిరుపతి

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



గుండోడి గుట్ట స్వాహా!

రామచంద్రాపురం మండలం నెన్నూరు సమీపంలోని గుండోడి గుట్టను ఓ టీడీపీ నేత యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. - 8లో



ఉచిత ఇసుక ఎక్కడ?

జిల్లాలో ఉచిత ఇసుక ఎక్కడా అందుబాటులో లేదు. ఇల్లు నిర్మించుకునేవారు ఇబ్బంది పడుతున్నారు. - 8లో



ఎస్వీయూలో కత్తిపోట్ల కలకలం

ఎస్వీయూలోని హెచ్ బ్లాక్ హాస్టల్‌లో శనివారం రాత్రి ఓ విద్యార్థి మద్యం సేవించి హల్‌చల్ చేశాడు. - 8లో

న్యూస్‌రీల్

ఐజర్‌లో వేడుకగా 'బర్డ్స్ అట్లాస్'



పక్షుల చిత్రం చూపుతున్న విద్యార్థులు

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం జంగాలపల్లె సమీపంలోని తిరుపతి ఐజర్‌లో ఆదివారం వేడుకగా బర్డ్స్ అట్లాస్ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతికి చెందిన నేచర్ సొసైటీ, అటవీశాఖ సహకారంతో ఐజర్, ఐఐటీ విద్యార్థులు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి వివిధ రకాల పక్షులు, వాటి వైవిధ్యతను సమగ్రంగా తెలుసుకుని బర్డ్ అట్లాస్ ద్వారా వెల్లడించారు. ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చినట్లు విద్యార్థులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : సీనియర్ ఇంటర్ జనరల్ విద్యార్థులకు సోమవారం 19వ తేదీ వరకు రెండు స్పెల్స్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 91 పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌గా సీసీ కెమెరా పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రాక్టికల్స్‌కు 23,793మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సైన్స్ ఎగ్జామినర్లు అప్పటికప్పుడే మూల్యాంకనం చేసి విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో సీఎస్‌లుగా ప్రభుత్వ లెక్చరర్లు విధులు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. అన్ని విభాగాలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు గ్రీవెన్స్‌కు హాజరుకానున్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఎమ్ఎస్ఎమ్ఈ సహకారంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించన్నారు. అడ్వాన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 2024–25 సంబంధించి 'పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ ప్రొసీజర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై జాతీయ సదుస్సు జరగనుంది

12న సద్యోముక్తి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున మాఘపూర్ణిమను పురస్కరించుకుని స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి వ్రతం, త్రిశూల స్నానం నిర్వహించడం ఆనవాయతీ. ఇందులో భాగంగా ఈనెల 12న స్వామి అమ్మవార్లు, పంచమూర్తులను జల వినాయకుని ఎదురుగా గల స్వర్ణముఖి నది ఒడ్డున కొలువు దీర్చి శాస్త్రోక్తంగా సద్యోముక్తి వ్రతం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తుంటారు. ఆధునిక సమాజంలో ఆడవారికి ఆకాశంలో సగం అంటూ అగ్రపీఠం వేశారు. అయితే కొందరు మాత్రం మహిళలను ఆటబొమ్మలుగానే చూస్తున్నారు. వంటింటి కుందేళ్లుగానే భావిస్తున్నారు. మళ్లీ ఆటవిక యుగంలోకే నెట్టేస్తున్నారు. ఇదే కోవలో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ వ్యవహరిస్తున్నారు. మహిళల రక్షణ అంటూ వారి పార్టీ అధినేత గొంతు చించుకుంటూ ఉంటే.. అనుయాయుడు మాత్రం అతివల జీవితాలతో ఆడుకుంటున్నారు. 'చిల్లర' వేషాలు వేస్తూ సాఫీగా సాగుతున్న సంసారాలను విచ్ఛిన్నం చేస్తున్నారు. గుట్టుగా కాపురం చేసుకుంటున్న వనితలను కల్లబొల్లి కబుర్లతో లోబరుచుకుని రూ.కోట్లు కాజేస్తున్నారు. ప్రశ్నించిన వారిని చంపేస్తానంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. బ్లాక్ టికెట్ విక్రయాలతో బతుకు మొదలుపెట్టిన సదరు కిరణ్‌వారు.. బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలతో స్వప్రకటిత నేతగా హల్‌చల్ చేస్తున్నారు. మెగా ఫ్యామిలీకి సన్నిహితుడని చెప్పుకుంటూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

కిలాడీ కిరణ్



మురిపాల కిరణ్

చిల్లర వేషాలు!

- బ్లాక్ టికెట్ విక్రయాలతో మొదలైన జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ జీవితం
- బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడుతూ రాజకీయం
- డబ్బుల కోసం విచ్చలవిడిగా వివాహేతర సంబంధాలు
- మెగా ఫ్యాన్ ముసుగులో యథేచ్ఛగా అక్రమాలు
- కామాంధుడిని కఠినంగా శిక్షించాలంటున్న మహిళా సంఘాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ''జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ నా జీవితం నాశనం చేశాడు. రూ.1.20 కోట్లు తీసుకుని మోసం చేశాడు. నన్ను అప్పుల పాలు చేసేశాడు. అడిగితే మమల్ని చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు'' అంటూ ఓ మహిళ విడుదల చేసిన ఆడియో.. వీడియోలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. జనసేనలో సదరు కిరణ్‌రాయల్ కీలకంగా వ్యవహరిస్తుండడంతో ఆ పార్టీకి తలనొప్పిగా మారాయి. దీనిపై పవన్‌కల్యాణ్ సైతం సీరియస్ అయినట్లు సమాచారం. కిరణ్ రాయల్‌పై చర్యలకు దిగినట్లు తెలుస్తోంది.

ఎవరీ కిరణ్?



కిరణ్ రాయల్ జీవితం అంతా వివాదాస్పదంగానే ఉంది. సుమారు 25 ఏళ్ల క్రితం తిరుపతికి వలస వచ్చిన కిరణ్ తన బతుకును గ్రూప్ థియేటర్స్ నుంచి ప్రారంభించాడు. చిరంజీవి సినిమాలకు బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తూ ఆపై మెగా స్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ నేతగా ఎదిగాడు. ఆ క్రమంలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రైల్వేస్టేషన్ ఎదురుగా ఓ హోటల్ యజమానిని ఒప్పించి కిళ్లీ కొట్టు ఏర్పాటు చేసుకున్నాడు. అప్పటి వరకు అతను కిరణ్‌గానే అందరికీ పరిచయం. కిళ్లీ కొట్టులో మాదకద్రవ్యాలను సైతం విక్రయించే ఈ స్థాయికి ఎదిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెగా ఫ్యాన్స్‌గా చిన్నపాటి కార్యక్రమాలు చేపడుతూ చిరంజీవి దృష్టిలో పడ్డాడు. మెగా ఫ్యాన్‌కు జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర పదవిలోనూ కొనసాగాడు. ఈ క్రమంలో తిరుపతి నగరంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళను పెళ్లి చేసుకున్నాడు. తదనంతరం కిరణ్ ''రాయల్''గా అవతరించాడు. ఇంతలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించడంతో అయనకు రాజకీయ ప్రాధాన్యం లభించింది. ఆపై పవన్‌కల్యాణ్‌కు దగ్గరవుతూ జనసేనలోనూ కొనసాగాడు. తిరుపతిలో ఆ పార్టీలో చేరేందుకు ముఖ్యనేతలెవ్వరూ మొగ్గు చూపకపోవడంతో కిరణ్ రాయలే పెద్ద దిక్కుగా మారాడు.



ఒక్కొక్కటి వెలుగులోకి..

కిరణ్ కుమార్ అలియాస్ కిరణ్ రాయల్ రాసలీలలు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. నమ్మించి మోసం చేసిన కిరణ్ రాసలీలల భాగోతాన్ని బాధిత మహిళ బట్టబయలు చేసింది. మరో వివాహితతో సైతం కిరణ్ శారీకర సంబంధం కొనసాగిస్తున్నట్లు ఆధారాలతో వెల్లడించింది. ఈ క్రమంలోనే జనసేన పార్టీలోని ఇద్దరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పార్టీ పదవులను పావులుగా చూపి లోబరుచుకున్నట్లు నగరంలో సైతం చర్చ జరుగుతోంది. కామాంధుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బాధితులతో పాటు మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తనలా కిరణ్ బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకురావాలని, మహిళలను మోసగించే దుర్మార్గుడికి శిక్షపడేందుకు ఆధారాలు ఇవ్వాలని లక్ష్మి కోరుతున్నారు.

దర్శన టికెట్లలో అవినీతి

తిరుపతి ఎమ్మెల్యేగా చిరంజీవి గెలుపొందిన రోజుల్లో కిరణ్ అక్రమాల భాగోతం తిరుమలకు పాకింది. తన అభిమాని కావడం, పార్టీ వ్యవహారాలు చూస్తుండడంతో శ్రీవారి దర్శన సిఫార్సు లేఖల వ్యవహారం మొత్తం కిరణ్‌కు అప్పగించారు. ఈ క్రమంలోనే సిఫార్సు లేఖలను కిరణ్‌రాయల్ అక్రమంగా రూ.లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ విషయం చిరంజీవి చెవిన పడడంతో ఆయన పలు మార్లు కిరణ్‌ని తీవ్రంగా మందలించిన విషయం తెలిసిందే. దీంతో కొంత కాలం పాటు కిరణ్‌ను పక్కన పెట్టారు. నాగబాబు ద్వారా మంతనాలు నడిపి మళ్లీ మెగా కుటుంబం పంచన చేరాడు. తిరుమలలో శ్రీవారి దర్శన టికెట్ల వ్యవహారంలో ఆయనపై పలు కేసులు నమోదవడం గమనార్హం.

'గో బ్యాక్ ఆరణి అంటూ'..

జనసేన పార్టీ తిరుపతి అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు పేరును ఖరారు చేయడంతో కిరణ్ రాయల్ తీవ్రంగా వ్యతిరేకించారు. ముందు ఆరణితో సఖ్యతగా ఉన్నా తనకు లొంగలేదన్న అక్కసుతో తిరుపతి నగరం అంతా 'గోబ్యాక్ ఆరణి' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించాడు. ఎన్నికల సమయంలో ఈ ఫ్లెక్సీల అంశం రాజకీయంగా కుదిపేసింది. జనసేనలోనే ఉంటూ ఆ పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరించడం ముఖ్యనేతలకు నచ్చలేదు. మెగా ఫ్యాన్ అసోసియేషన్ నేత కావడంతో మందలించి వదిలేశారు. ఎన్నికలలో ఆరణికి వ్యతిరేకంగా పనిచేశాడని ఆధారాలతో సహా పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే మొన్నటి వరకు ఎమ్మెల్యేతో ఉప్పు నిప్పుగా ఉంటూ వచ్చాడు. మళ్లీ కొద్దిరోజులుగా ఎమ్మెల్యే ఇంటి వైపునకు వెళ్లివస్తున్నాడు. ఇంతలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం ఆ పార్టీలో సంచలనంగా మారింది. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నత అధికారులను టార్గెట్ చేసుకుని బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడ్డాడు. అసభ్యంగా దూషిస్తూ తీవ్రమైన విమర్శలు మూటగట్టుకున్నాడు. ఈ క్రమంలోనే అప్పటి టీటీడీ ఈఓ, కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌ను సైతం బ్లాక్‌మెయిల్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

మాయమాటలతో మహిళలకు వల!



సరసాల కిరణ్

తనకున్న మాటకారితనం, హావభావాలతో మహిళలను ఆకట్టుకునేవాడు. తనకు పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నా ఇతర మహిళలను వలలో వేసుకోవడం పరిపాటిగా మార్చుకున్నాడు. అందులో భాగంగా తన పక్కింటిలో ఉన్న లక్ష్మీరెడ్డి కుటుంబంతో చనువు పెంచుకున్నాడు. మాయ మాటలు చెప్పి ఆమెను బుట్టలో వేసుకున్నాడు. చివరకు ఆ కుటుంబం విడిపోవడానికి కారకుడయ్యాడు. అతడి మోజులో పడిన ఆ మహిళ కుటుంబాన్ని వదలి కిరణ్ వెంట నడిచింది. రాజకీయంగా ఎదుగుతున్న తనకు ఆర్థిక అండ అవసరమని గుర్తించి ఆమెకున్న ఎకరం భూమిని అమ్మించి సొమ్ము చేసుకున్నాడు. పలు దఫాలుగా రూ.1.32కోట్ల నగదును చేయిబదులుగా తీసుకున్నట్లు ఆ మహిళ ఆధారాలను బయటపెట్టింది. దీంతో పాటు 300గ్రాముల బంగారు నగలను కాజేశాడని వెల్లడించింది. ఆమెతో వివాహేతర సంబంధం నడుపుతూనే మరో మహిళను ముగ్గులోకి దింపాడు. కొన్నాళ్లకు ఈ వ్యవహారం బట్టబయలు కావడంతో ఇద్దరి మహిళల మధ్య చిచ్చురేగింది. దీనిపై నిలదీయడంతో లక్ష్మిని దూరం పెడుతూ వచ్చాడు. నిన్ను నమ్ముకుని సర్వస్వం నీకే ఇచ్చేశాను.. నీ కారణంగా నా కుటుంబం రోడ్డున పడింది. నా బిడ్డలు అనాథలయ్యారని లక్ష్మి వేడుకున్నా కఠిన మనస్తత్వం కరగలేదు. దీంతో ఆమె తనకు ఇవ్వాల్సిన నగదు బంగారం తిరిగి ఇవ్వాలని కిరణ్‌ను అడగడంతో వివాదం పెద్దదైంది. ఈ క్రమంలోనే ఆ మహిళ పట్ల దారుణంగా వ్యవహరించి, పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడుతూ చంపేస్తానంటూ బెదిరించాడు. ఆమెపై నేరుగా దాడి చేసినట్లు వాయిస్ రికార్డులో కిరణ్ ఒప్పుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. నిన్ను చంపి బెయిల్‌పై తిరిగొస్తా.... నిన్ను ఎవడు కాపాడుతాడో చూస్తా... నీలాంటి వాళ్లను చాల మందిని చూశా... నా వెంట్రుక కూడా ఏవరూ పీకలేరు...నీవల్ల ఏమవుతుందో అది చేసుకో...అంటూ దారుణంగా మాట్లాడిన ఆడియో, వీడియోలు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. మొత్తం వ్యవహారంపై బాధితురాలు తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.

సస్పెన్షన్‌కు రంగం సిద్ధం!

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుబడతానని, మహిళలకు రక్షణ కవచంలా ఉంటానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరచూ ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతికి జనసేన ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కిరణ్ రాయల్ వికృత పోకడలపై వీడియో, ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహిళను చంపేస్తానంటూ బెదిరించిన కిరణ్ రాయల్‌ను పార్టీ నుంచి నేడో, రేపో సస్పెన్షన్ వేటు వేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఆధారాలు వెలుగు చూసినా పార్టీ అధిష్టానం రెండు రోజులుగా స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ పార్టీకి చెందిన ముఖ్యనేతలు సైతం



చినబాబుతో చిల్లర కిరణ్

కిరణ్‌రాయల్ అక్రమాలపై కచ్చితమైన ఆధారాలతో పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. తదుపరి నిర్ణయం ప్రకటించేవరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కిరణ్ రాయల్‌కు స్పష్టం చేశారు.

వేధిస్తే.. వదిలిపెట్టం



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధనరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ మేరిగ


చిల్లకూరు : కూటమి నేతల అడుగులకు మడుగులొత్తుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధించి, అక్రమ కేసులు బనాయించే అధికారులను భవిష్యత్‌లో వదిలిపెట్టే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం గూడూరు మండలం మంగళపూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని సతీష్‌యాదవ్ కుటుంబీకులను పరామర్శించారు. కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై కూటమి నేతలు అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారని, వారికి పోలీసులు సహకారం అందిస్తున్నారని మండిపడ్డారు. గూడూరు రూరల్ పోలీసులు ఈ క్రమంలోనే సతీష్‌యాదవ్‌ను అక్రమంగా నిర్బంధించి దారుణంగా హింసించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలోని పల్లెల్లో విధ్వంసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసాతో కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చిందని వెల్లడించారు. అక్రమ కేసులు నమోదు చేసే పోలీసులకు భవిష్యత్‌లో శంకరగిరి మాన్యాలే దిక్కని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిలపడిన కూటమి నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నేత యద్దల నరేంద్రరెడ్డి, ఎంపీపీ బూదరు గురవయ్య, కొండూరు సునీల్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, మెట్టా రాధాకృష్ణారెడ్డి, వాయిగండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గీత'.. రాత మారేనా..!

- నేడు కల్లుగీత కార్మికులకు వైన్‌షాపుల కేటాయింపు

తిరుపతి క్రైమ్ : కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాలను సోమవారం కేటాయించనున్నారు. కలెక్టరేట్‌లో లాటరీ విధానంలో వైన్‌షాపులను దరఖాస్తుదారులకు అందించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 23 దుకాణాలకు మొత్తం 185 దరఖాస్తులు అందాయి. సోమవారం ఉదయం 9 గంటల నుంచి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లాటరీ నిర్వహించి కల్లుగీత కార్మికులకు చెందిన ఉపకులాల వారికి షాపుల కేటాయించనున్నారు. ఈ క్రమంలో తిరుపతి రూరల్‌కు సంబంధించి ఈడిగ కులానికి కేటాయించిన దుకాణానికి అత్యధికంగా 30 దరఖాస్తులు వచ్చాయి. అలాగే డక్కిలి మండలంలో ఈడిగ, సూళ్లూరుపేట పట్టణంలో గాండ్ల కులానికి కేటాయించిన షాపులకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే రావడం విశేషం. దీంతో వారికి దుకాణం దక్కినట్లుగానే భావించాల్సి ఉంటుంది. తిరుపతి నగర పరిధిలో ఈడిగ కులానికి కేటాయించిన వైన్‌షాపునకు 25 దరఖాస్తులు, పుత్తూరు మున్సిపాలిటీలో గౌడ కులం నుంచి 13 , ఓజిలి మండలంలో ఈడిగ– 11 , చిట్టమూరు మండలంలో గౌడ్– 11 దరఖాస్తులు, తడ మండలంలో ఈడిగ– 17 దరఖాస్తులు వచ్చాయి.. మిగిలిన దుకాణాలకు 2 నుంచి 09 వరకు దరఖాస్తులు అందాయి. అయితే ఇందులో పలు వైన్‌షాపులను దక్కించుకునేందుకు కుటమి నేతలు లోపాయికారీగా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చర్చ సాగుతోంది.

"పారదర్శకంగా ప్రక్రియ



కల్లుగీత కార్మికులకు సోమవారం ఉదయం 9గంటలకు లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుంది. దరఖాస్తుదారులు ఉదయం 8.30 గంటలకే కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. ఎక్సైజ్‌శాఖ అధికారులతోపాటు కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో లాటరీ తీస్తాం. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేస్తాం. – నాగమల్లేశ్వర్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

విహంగం..విలాపం!



ఫిబ్రవరిలోనే ఎండిపోయిన పులికాట్ సరస్సు

భగ్గు మంటున్న సూరీడు

- అడుగంటుతున్న పులికాట్ సరస్సు
- విదేశీ విహంగాలకు ఆహారం కొరత
- దీనంగా కూర్చొండిపోతున్న పక్షులు!

సూళ్లూరుపేట: మంచు తెరలు తొలగకముందే సూరీడు భగ్గుమంటున్నాడు. ఉదయం కాస్త ఉపశమనమిచ్చి పొద్దెక్కే కొద్దీ భగ్గుమంటున్నాడు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన సరస్సులు, కొలనులు అప్పుడే అడుగంటుతున్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పులికాట్ సరస్సు అప్పుడే ఎడారిని తలపిస్తోంది.

పక్షుల పండుగతోనే సరి!

రాష్ట్ర పర్యాటక శాఖ కోట్లాది రూపాయలు వెచ్చించి పక్షుల పేరుతో పండుగ చేస్తుందే తప్ప వలస విహంగాలకు కడుపునిండా ఆహారం తినేందుకు ఉన్న పులికాట్ సరస్సును మాత్రం అభివృద్ధి చేయడంలేదు. పక్షుల పండుగకు కేటాయిస్తున్న ఈ నిధుల్లో కొంత భాగాన్ని వెచ్చించి ముఖద్వారాలు పూడిక తీయిస్తే ఈ పరిస్థితి నుంచి బయటపడే అవకాశం ఉన్నప్పటికీ పాలకులు ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఈ ఏడాది పండుగకు విచ్చేసిన పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా మంత్రి అనగాని సత్యప్రసాద్ పులికాట్ ముఖద్వారాల పూడిక తీయించేందుకు రూ.140 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు రూ.140 కూడా మంజూరు చేయలేదు. దీనిపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.




పులికాట్ సరస్సు ఎండి పోతుండడంతో ఆహారం కోసం గాలిస్తున్న పెయింటెడ్ స్టార్క్స్ (ఎర్రకాళ్ల కొంగలు)

మూగ రోదన

ఈ ఏడాది నవంబర్‌లోలోనే పలు రకాల విదేశీ వలస విహంగాలు విచ్చేశాయి. ముఖ్యంగా ఫ్లెమింగోలు, పెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్స్‌లతోపాటు అనేక రకాల పక్షులు విచ్చేసి ఆహారవేటలో ఉంటూ పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఇందులో ఫ్లెమింగోలు నీళ్ల అలా ఎండిపోగానే గుజరాత్‌లోని రాణా ఫ్‌కచ్ అనే ప్రాంతానికి వెళ్లిపోయాయి. పెలికాన్స్ నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో పిల్లలను పొదిగి పెద్దవి చేసుకునే పనిలో ఉన్నాయి. శ్రీహరికోట రోడ్డుకు ఉత్తరం వైపు సరస్సు ఎడారిగా మారడంతో నేలపట్టులోని పక్షులు సమీపంలోని చెరువుల్లో, పల్‌వేరికాడ్, ఎన్నూరు ప్రాంతాలకు వెళ్లి ఆహారవేట చేస్తున్నాయి. ఎర్రకాళ్లకొంగలు మాత్రం ఇప్పటికీ ఇక్కడే ఉన్నాయి. సరస్సు ఎండిపోవడంతో ఆహారం లేక పక్షులు మూగరోదనతో అల్లాడిపోతున్నాయి. మామూలుగా అయితే విదేశీ వలస విహంగాలు పిల్లలను పొదిగి, వాటిని పెద్దవి చేసుకునే వెళ్లే సమయమిది. ఈ సమయంలో ఎండిపోయిన సరస్సులో నేలమీద మోకాళ్లు మడిచి కూర్చుని తమ విలాపాన్ని వ్యక్తం చేస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి. కొన్ని వలస విహంగాలు ఆహారం లేకపోవడంతో కాళ్లు మడతేసుకుని కూర్చుని కనిపించాయి. వీటి మూగ రోదన చూసిన పర్యాటకులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెటర్నరీ జూడాల రక్తదానం

- ఏడో రోజుకు చేరిన సమ్మె



తిరుపతి సిటీ : గౌరవ వేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా పశు వైద్య విద్యార్థులు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. ఆదివారం సమ్మెలో భాగంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహకారంతో సుమారు 30మందికి పైగా వెటర్నరీ జూడాలు రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరవధిక సమ్మె చేపట్టినా గౌరవ వేతనం పెంచడంలో ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులు, మంత్రులను కలసి తమ గోడును విన్నవించుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతుల సంక్షేమం కోసం పనిచేసే తమకు అన్యాయం చేయడం సరికాదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వర్సిటీ అధికారులు స్పందించి ఇతర విభాగాల వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ అందించాలని కోరారు. అప్పటి వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

కోడి పందెం స్థావరంపై దాడి



కోడి పందెం నిర్వాహకులతో పోలీసులు

దొరవారిసత్రం: ముచ్చలగుంట గ్రామ సమీపంలోని అడవీ ప్రాంతంలో కోడి పందెం స్థావరంపై ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు నిర్వాహకులతో పాటు రూ.7,800 నగదు, రెండు బైక్‌లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిర్వాహకులను సోమవారం సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండు హోటళ్లకు బాంబు బెదిరింపు

తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరంలోని అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రెండు హోటళ్లకు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. గత మూడు నెలలుగా వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తుండడం గమనార్హం. అయినప్పటికీ అలిపిరి పోలీసుల, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి బాంబు లభ్యం కావకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం పెద్దకన్నలి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. బైక్ అదుపు తప్పడంతో యువకుడు కిందపడి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

సూక్ష్మం.. దూరంగా లక్ష్యం!

బిందు సేద్యంపై అన్నదాతలకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలమవుతున్నారు. రాయితీపై అందిస్తున్న డ్రిప్ పరికరాలను పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేకపోతున్నారు. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే అవకాశానికి రైతులను దూరం చేస్తున్నారు. దరఖాస్తుకు గడువు సమీపిస్తున్నప్పటికీ లక్ష్యసాధనలో వెనకడుగు వేస్తున్నారు.



సూళ్లూరుపేట మండలం ఉగ్గుముడి గ్రామంలో సబ్సిడీతో ఇచ్చిన డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- తగ్గుతున్న బిందు సేద్యం
- మిగిలిపోతున్న రాయితీ యూనిట్లు
- 4,500 హెక్టార్లకు గాను 1,150 హెక్టార్లకే పరికరాలు
- రైతులకు అవగాహన కల్పిండంలో విఫలమైన అధికారులు
- మార్చి 31 వరకే దరఖాస్తుకు అవకాశం

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టే స్కీమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అందులో చిన్నపాటి రాయితీలు ఉంటే చక్కటి ఆదరణ వస్తుంది. అయితే సూక్ష్మ సేద్య విభాగానికి సంబంధించి డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు 45 శాతం నుంచి 90శాతం రాయితీలు ఇస్తున్నప్పటికీ వీటిపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలమయ్యారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో రాయితీలతో అందిస్తామని చెబుతున్నా డ్రిప్ పరికరాలకు ఆదరణ లేకుండా పోయింది. సూక్ష్మ సేద్య నీటి పథకం ద్వారా డ్రిప్ పరికరాలను 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు 4,500 హెక్టర్లకు రాయితీపై రైతులకు అందించాలనే లక్ష్యం ఉంది. ఈ క్రమంలో దశల వారీగా దరఖాస్తులకు కలెక్టర్ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 1,740 హెక్టర్లకు రాయితీ పరికరాలను ఇవ్వడానికి మాత్రమే కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారు. అయితే సూక్ష్మ సేద్య నీటి పథకానికి చెందిన అధికారులు 1,150 హెక్టార్ల పరిధిలోని రైతులకు మాత్రమే రాయితీ పరికరాలను అందించారు. తొలి దశలో కలెక్టర్ మంజూరు చేసిన వాటిలోనే 590 హెక్టార్లకు సంబంధించి పరికారలు మిగిలిపోయాయి. మార్చి 31 వరకు మాత్రమే వీటి పంపిణీకి గడువు ఉంది. ఒకప్పుడు తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే టాప్ 10లో రాయితీ పరికరాల పంపిణీలో ఉండేది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే జిల్లా వెనుకబడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రాయితీలు ఇలా..

డ్రిప్ పరికరాలకు సంబంధించి 5 ఎకరాల లోపు సన్న,చిన్నకారు రైతులకు యూనిట్ ధరలో 90శాతం రాయితీ లభిస్తోంది. 8 ఎకరాలు పైగా, 10 ఎకరాలు లోపు ఉన్నవారికి 70శాతం రాయితీ ఉంటుంది. స్ప్రింకర్లు అయితే 5 ఎకరాల లోపు రైతులకు యూనిట్ ధరలో 50శాతం రాయితీ, 5ఎకరాలకు పైగా 10 ఎకరాలకు లోపు వారికి 45 శాతం రాయితీ ఉంటుంది.

దరఖాస్తు ఇలా..

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పొందడానికి ఆధార్ కార్డు, తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ, భూమి యాజమాన్య పత్రం లేదా 1బీ రికార్డుతో రైతు భరోసా ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. తప్పనిసరిగా రైతు ఫోన్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలి.

డ్రిప్ పరికరాల పంపిణీ వివరాలు

2022-23	1613 హెక్టార్లు
2023-24	1,580 హెక్టార్లు
2024-25	1,150 హెక్టార్లు

అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు బిందు సేద్యానికి సంబంధించి రాయితీ పరికరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 1,150 హెక్టార్లకు మాత్రమే రాయితీ పరికరాలను అందించాం. ఇంకా పరికరాలను ఉన్నాయి. మార్చి 31 లోపు రైతులు వచ్చి సంప్రదిస్తే వెంటనే మంజూరు చేస్తాం. 45 శాతం నుంచి 90 శాతం వరకు కేటగిరీల వారీగా సబ్సిడీలు అందిస్తున్నాం.

– సతీష్, జిల్లా సూక్ష్మ సేద్యం అధికారి

అధికారి బిజీ.. జనం గజిబిజి!

- బీసీ కార్పొరేషన్ రుణాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు
- సర్వర్ సమస్యతో ప్రజల ఇబ్బందులు
- సందేహాల నివృత్తికి స్పందించని అధికారులు
- ఇదే అదునుగా లాబీయింగ్ మొదలెట్టిన కూటమి నేతలు

తిరుపతి అర్బన్ : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. జిల్లాకు మొత్తం 1,979 యూనిట్లు మంజూరైతే ఇప్పటికే 7,700 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 12వ తేదీ వరకు గడువు పెంచిన నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్యల 10వేలు దాటవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రుణాలకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు జనం నానా అవస్థలు పడుతున్నారు. సచివాలయ ఉద్యోగులు సర్వేలకు పరిమితం కావడంతో సమాధానం చెప్పడం లేదు. ఎంపీడీఓలు సర్వేల పర్యవేక్షణ నెపంతో అందుబాటులో ఉండడంలేదు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవిని సంప్రదించేందుకు పలువురు యత్నిస్తున్నారు. అయితే ఆమె మూడు పోస్టుల్లో ఉన్నందున బిజీగా ఉన్నానని ఎవరినీ కలిసేందుకు అనుమతించడం లేదు. ఒకవైపు చూస్తే సర్వర్లు పని చేయకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు పలువురు ఇబ్బందిపడుతున్నారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అధికారులు, సిబ్బంది సహకరించడం లేదు. దీంతో ఇదే అదునుగా కూటమి నేతలు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేను ఆశ్రయిస్తున్నారు. తమకే రుణాలు ఇప్పించాలని సంప్రందింపులు చేస్తున్నారు. ఎమ్మెల్యేల సిఫార్సులను కాదని తమకు రుణాలు మంజూరు చేస్తారా అని దరఖాస్తుదారులు మధనపడుతున్నారు.

సమస్యలు సరిచేస్తాం



శ్రీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకునేందుకు 12వ తేదీ వరకు అవకాశముంది. చిత్తూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీ, బీసీ కార్పొరేషన్ ఈడీ, తిరుపతి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్నా. అందుకే నిత్యం పనుల ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఈ క్రమంలోనే దరఖాస్తుదారులను కలవలేకపోతున్నా. ఎవరికైనా దరఖాస్తు చేసుకోవడంలో సందేహాలుంటే సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓలను సంప్రదించాలి. అలాగే సర్వర్ సమస్యలను సరిచేస్తాం.

సీపీఆర్ కొత్త అపార్ట్‌మెంట్‌కు భూమి పూజ



ప్లాట్ల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ అధినేత, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సీపీఆర్ కన్‌స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో మంగళం రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూంకు ఎదురుగా నిర్మించనున్న సీపీఆర్ సరికొత్త 2బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ సంస్థ ఎండీ చలపతిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకమైన, ఆధునిక సదుపాయాలతో కూడిన 2బీహెచ్‌కే ఫ్లాట్లను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ప్రీమియం లొకేషన్, మోడర్న్ డిజైన్ అండ్ ఆర్కిటెక్చర్, 24/7 సెక్యూరిటీ సేఫ్టీ, పార్కింగ్, క్లబ్ హౌస్, పార్క్ వంటి ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాక పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్ సమీపంలో ఏర్పాటు చేస్తూ అందరికీ అనువైన చోట మీ కలల ఇంటిని నిజం చేసుకునేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రీ బుకింగ్ ప్రారంభమైందని, ప్రారంభ ఆఫర్ ధర రూ.37 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. పరిమిత సమయం, పరిమిత యూనిట్లకు మాత్రమే ఉంటుందని, మీ ఆస్తి సొంతం చేసుకోవడానికి ఇదే సరైన సమయం అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492013322, 9492013366లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆసంస్థ డైరెక్టర్లు కాశి విశ్వనాథ్, లోకేష్, వినీష్ పాల్గొన్నారు.



తిరుమలలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆదివారం రాత్రి తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి పద్మావతి అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శనం ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అకౌంటింగ్‌పై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో అస్పైర్-2025 పేరుతో విద్యార్థులకు ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీలోనరి ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐటీఎంఏఐ ప్రెసిడెంట్ బిభూతి భూషణ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ప్రసాద్, వినయ్ రంజన్, సీఐఆర్‌సీ చైర్మన్ విశ్వనాథ్‌భట్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ రంగాలలో విద్య, ఉపాధి అవకాశాలు, ఆధునిక సమాజంలో అకౌంటింగ్ పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తుడా క్వార్టర్స్‌లో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

తిరుపతి రూరల్ : మండలంలోని తిరుమల నగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్ ఎంఐజీ లే అవుట్ 81 ఫ్లాట్‌లో భారీ చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు.. స్విమ్స్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఏఆర్ నరేంద్రబాబు తన భార్యను సర్జరీ నిమిత్తం ఈనెల 5వ తేదీన సిమ్స్‌లో అడ్మిట్ చేశారు. 8వ తేదీ వరకు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మూడు రోజుల పాటు ఇంటికి తాళం వేసిఉండడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం చిత్తూరు నుంచి నరేంద్ర బాబు కుమారుడు రేవంత్ తన తల్లిని చూసేందుకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథం ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు బాధితులు మాట్లాడుతూ 188 గ్రాముల బంగారం, రూ.48 వేల నగదు అపహరణకు గురైనట్లు వెల్లడించారు.

ఉచిత ఇసుక ఎక్కడ?

తిరుపతి అర్బన్: జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలు కావడం లేదు. ఇసుక అవసరమైన వారు ప్రైవేటుగా కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం గత జూలై 8 నుంచి ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చింది. జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గం, మొగళ్ల గుంట వద్ద టన్ను ధర రూ.590, సూళ్లూరుపేట నియోజకవర్గం, మావిళ్లపాడు వద్ద టన్ను ధర రూ.465, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు ఏకే బేడు వద్ద టన్ను రూ.200, సుబ్బానాయుడుకండ్రిగ వద్ద రూ.200 చొప్పున విక్రయించారు. గత ఏడాది సెప్టెంబర్ వరకు అరకొరగా ఇసుకను ఇచ్చినప్పటికీ అక్టోబర్ నుంచి స్టాక్ లేదని చేతులెత్తేశారు. ఆ తర్వాత నవంబర్ నుంచి కొత్తగా పెళ్లకూరు మండలంలోని పుల్లూరు గ్రామ సమీపంలోని పాలచ్చూరు వద్ద రెండు పాయింట్లు, కోట మండలంలోని గూడలి గ్రామం సమీపంలోని స్వర్ణముఖి బ్యారేజ్ వద్ద ఒక పాయింట్‌ను గుర్తించినట్లు చెప్పారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయలేదు. ఈ విషయంపై మైనింగ్, ఇరిగేషన్ అధికారులు సైతం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తే మార్చి 1 నుంచి అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. దీనిపై పేదలు పెదవి విరుస్తున్నారు.

ఎర్రచందనం పట్టివేత

వరదయ్యపాళెం: మండలంలోని ఎంజీనగర్ అటవీ ప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను ఎస్ఐ మల్లికార్జున్ తెలిపిన మేరకు వివరాలు.. ఎర్రచందనం దుంగలను కారులో తరలించనున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు కారులో దుంగలను గుర్తించారు. కారుతోపాటు పక్కనే ఉన్న బైక్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టి ఎర్రదొంగలు పరారైనట్లు సీఐ మురళి తెలిపారు. దాడిలో కానిస్టేబుళ్లు హరి, సుబ్రమణ్యం, ఉదయ్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో కత్తిపోట్ల కలకలం

- మద్యం సేవించి ఓ విద్యార్థి ఘాతుకం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుపతి క్రైమ్/ తిరుపతి సిటీ: ఎస్వీయూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందా..? సరస్వతీ నిలయంలో అరాచకశక్తులు తిష్టవేస్తున్నారా..? అవుననే అంటున్నారు. విద్యార్థులు. వర్సిటీ హాస్టళ్లను అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. వర్సిటీలోని హెచ్ బ్లాక్ హాస్టల్‌లో శనివారం అర్ధరాత్రి 12.45గంటలకు జరిగిన ఘర్షణతో విద్యార్థులు, సిబ్బంది వణికిపోయారు.

మద్యం సేవించి హల్‌చల్

ఎస్వీయూ హెచ్ బ్లాక్ హాస్టల్‌లోకి ఎకనామిక్స్ విభాగం విద్యార్థి రాత్రి 12గంటలకు మద్యం సేవించి ప్రవేశించాడు. హాస్టల్‌లోని తోటి విద్యార్థులతో గొడవకు దిగాడు. ముగ్గురిపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టాడు. మరో విద్యార్థిని తన వెంట తీసుకువచ్చిన కత్తితో పొడిచేశాడు. ఈ విషయం గమనించిన పక్క రూమ్‌లోని విద్యార్థులు వెంటనే ఎస్వీయూ క్యాంపస్ పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే హాస్టళ్లలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయట వ్యక్తులు నిత్యం హాస్టళ్లలోకి ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మద్యం సేవించి విద్యార్థులను గొడవలకు పురిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో అనధికారికంగా తిష్ట వేసిన వారిని వెంటనే బయటకు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్వీయూ ప్రతిష్టను కాపాడాలని కోరుతున్నారు.

చెరువులో పడి యువకుడి దుర్మరణం



లోకేష్ (ఫైల్)

రామచంద్రపురం : రాయలచెరువులో పడి శనివారం రాత్రి ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలు.. రాయలచెరువుపేట గ్రామానికి చెందిన పెనుగొండ లోకేష్ (23) ద్విచక్ర వాహనంలో నెత్తకుప్పానికి చెందిన లీలాకృష్ణను ఇంటి వద్ద విడిచిపెట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. లోకేష్ కుటుంబీకులు దీనిపై లీలాకృష్ణను ఫోన్ చేయగా తనను వదిలిపెట్టి అప్పుడే తిరుగుప్రయాణమైనట్లు వెల్లడించాడు. లోకేష్ ఫోన్ పనిచేయకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రామాంజనేయులు వెంటనే లోకేష్ ఫోన్ నంబర్‌తో లొకేషన్ ట్రాక్ చేయగా రాయలచెరువు కట్ట వద్ద ఉన్నట్లు చూపించింది. పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మొదటగా చెరువులో ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. వాహనం అదుపు తప్పి చెరువులో పడుంటాడని అనుమానించారు. గజఈత గాళ్లతో వెతికించగా లోకేష్ మృత దేహం వెలికి తీశారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మృత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

మంటలు చెలరేగి మహిళ మృతి

తిరుపతి క్రైమ్ : గ్యాస్‌స్టవ్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. ఎంఎం శాంత, నరేంద్ర దంపతులు కేటీరోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో శాంత వంట చేసేందుకు స్టవ్ వెలిగిస్తుండగా ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన శాంతను వెంటనే రుయా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో ఆమె మరణించారు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో 'ఆహ్వాన' విధులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆహ్వానపత్రికల పంపిణీకి సంబంధించి ఆలయ అధికారులకు ఈఓ బాపిరెడ్డి విధులు కేటాయించారు. ఆదివారం ఈ మేరకు ప్రకటించారు. డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి, ఏఈఓ హేమమాలిని ఆధ్వర్యంలో రాజశేఖర్, రాజా వైదేశ్వరన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, మంత్రులకు ఆహ్వానం అందించాలన్నారు. ఏఈఓ సతీష్‌మాలిక్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్, సుగుణ, కుమార్ సిబ్బందితో తిరుపతి, చిత్తూరు, బెంగళూరులోని ప్రముఖులకు ఆహ్వానపత్రికలు పంపించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ విజయసారథి, సిబ్బంది వెంకటసురేష్, శివకుమార్ ఆధ్వర్యంలో పీలేరు, కడప, అనంతపురం, కర్నూలు, హైదరాబాద్, నెల్లూరులోని ప్రముఖులకు, నాగయ్య ఆధ్వర్యంలో తిరుత్తణి, నగరిలో ఆహ్వాన పత్రికలు పంచాలని సూచించారు. శ్రీకాళహస్తిలో ఆహ్వానించే బాధ్యతలను సూపరింటెండెంట్ నాగభూషణానికి అప్పగించారు.

గుండోడి గుట్ట స్వాహా!

- 25 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- చదును చేసి పొలంగా మార్చుతున్న టీడీపీ నేత
- పట్టించుకోని రెవెన్యూ



రామచంద్రాపురం మండలం నెన్నూరు సమీపంలో టీడీపీ నేత తవ్వేస్తున్న గుండోడి గుట్ట

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కొండలు, గుట్టలను తొలగించి గుట్టుగా ఆక్రమణకు పాల్పడుతున్నాడు. ఆక్రమిత భూములను చదును చేస్తూ అందులోని మట్టిని కూడా అమ్మేసుకుంటున్నాడు. పెద్ద, పెద్ద బండరాళ్లను సైతం భారీ యంత్రాలతో పక్కకు జరిపి యథేచ్ఛగా గుట్టను చదును చేసి పొలాలుగా మార్చుకుంటున్నాడు. ఎంతో విలువైన 25 ఎకరాల భూమిని దర్జాగా కబ్జా చేసి సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నాడు. అధికారం చేతిలో ఉంది.. ఆక్రమిస్తే అడిగేదెవ్వరు..? అన్నట్లు ఆ పచ్చ నేత బరితెగించడం విమర్శలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు కూడా మనకెందుకులే అన్నట్లుగా వదిలేయడంతో ఎవరైనా ఆ పచ్చనేతను ప్రశ్నిస్తే తమకు పట్టా ఉందని బుకాయిస్తున్నారు. దీంతో ఇన్నేళ్లుగా లేని పట్టాలు ఇప్పుడు ఎలా పుట్టుకొచ్చాయని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గుట్టపై కన్నేసి.. రహదారి ఏర్పరచి!

గుండోడి గుట్టపై కన్నేసిన పచ్చనేతకు ఒక్కసారిగా గుండోడు కణం రోడ్డు గుర్తుకు వచ్చింది. అంతే ఆ రోడ్డు నిర్మాణానికి చకచకా పావులు కదిపి స్థానిక ప్రజాప్రతినిధి చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేయించారు. ఆ రోడ్డు నిర్మాణంతో 30 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని సోషల్ మీడియా వేదికగా ప్రచారం హోరెత్తించారు. అంతే ఎవ్వరికీ అనుమానం రాకుండా గుండోడు గుట్టను తొలిచే పని మొదలుపెట్టారు. మొదట్లో ఆ దారి ఏర్పాటుకు మట్టి తవ్వుతున్నట్లు చెప్పినా ఆపై గుట్టను చదును చేసి సాగు భూములుగా మార్చేసుకున్నట్లు సమాచారం. తరతరాలుగా ఉన్న గుట్టను కాస్త సాగు భూమిగా మార్చేయడం పట్ల స్థానికులు ప్రశ్నిస్తే తమకు ఎప్పుడో పట్టాలు ఇచ్చారని నమ్మిస్తున్నట్టు సమాచారం. దీనిపై రామచంద్రా పురం మండల తహసీల్దారు వెంకటరమణను వివరణ కోరగా గుట్టను ఆక్రమించినట్టు తనకు తెలియదని, దానిపై విచారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలం

రామచంద్రాపురం మండలం, గణేశ్వరపురం పంచాయతీ పరిధిలోని గుండోడి గుట్టను టీడీపీ నేత గుట్టుగా ఆక్రమించుకుని చదును చేస్తున్నారు. ఆ భూమిపై ఎప్పటి నుంచో కన్నేసిన ఆ పచ్చ నేత ఎలాగైనా ఆ భూమిని కొట్టేసేందుకు తనకు రాజకీయంగా ఒక గుర్తింపు ఇచ్చిన పార్టీ (టీడీపీ)ని విడిచి వైఎస్ఆర్‌సీపీ కండువా వేసుకున్నారన్న విమర్శలు కూడా వస్తున్నాయి. అయితే జగనన్న ప్రభుత్వంలో ఆ గుట్టను కొట్టేసేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో గత ఎన్నికల సమయంలో తిరిగి టీడీపీ పంచన చేరారు. ప్రస్తుతం ఆ పార్టీ అధికారంలోకి రావడం, స్థానిక ప్రజాప్రతినిధి సహకారం పుష్కలంగా లభిస్తుండడంతో విలువైన ఆ భూమిని దర్జాగా కబ్జా చేసేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.